# కాగితం పువ్వు

**"శంకరం,** ఇవాళ కాలేజీలో నాగాన కచేరి ఉంది. మీ ఫ్రెండ్స్‌తో చెప్పి బాగా చప్పట్లు కొట్టించాలి. లేకపోతే నాకు 'మూడ్' రాదు."

చిన్నప్పటి నుంచి ప్రమీల స్వభావం అంతే. తనకి కావాల్సింది డిమాండ్ చేసి సంపాదిస్తుంది. ఇతరుల అవసరాలని గుర్తించనే గుర్తించదు.

శంకరం మంచి వక్త. ఎలొక్యూషన్ కాంపిటీషన్‌లో ఎన్నోసార్లు బహుమతులొచ్చాయి. ఒక్కసారీ ప్రమీల రాలేదు.

"ఉపన్యాసాలు క్లాసులో వినటమే నాకు బోర్ బాబూ. నన్ను చంపకు."

అయినా శంకరానికి ఆమె అంటే ఇష్టం.

"నేను చప్పట్లు కొట్టించట మెందుకండీ? మీ సంగీతం విన్నవారు ఎవరైనా పరవశులైపోతారు. మీరు ఒకనా డెప్పుడో సంగీత సరస్వతి అయిపోతారు. మీ కచేరీకి తప్పకుండా వస్తానండీ."

పొగడ్తకు మనసులో పొంగిపోయింది. కానీ 'థాంక్స్' అని కూడా అనలేదు.

కాలేజీలో చదివే రోజుల్లో ఇలాంటి సంఘటనలెన్నో.

ప్రమీల ఇప్పుడు రేడియో ఆర్టిస్టయింది. సంగీత సభల్లో కచేరీలు చేస్తోంది. డిగ్రీతో చదువు మానేసింది.

శంకరం బి.ఎల్.ఫైనల్ ఇయర్‌లో కొచ్చాడు.

"ఒరేయ్ శంకరం. మా ప్లీడరుగారి అమ్మాయి పెళ్ళిచూపులట. ఏర్పాట్లు చేసే బాధ్యతలన్నీ మనిద్దరికీ అప్పగించారు ప్లీడరుగారు."

ఆ రోజు కాలేజీ నుంచి రాగానే తండ్రి చెప్పేడు. శంకరం మనస్సు కలుక్కుమంది. తనేదో కోల్పోతున్నట్లనిపించింది.

శంకరం తండ్రి సుబ్బరామయ్య, ప్రమీల తండ్రి శ్రీనివాసరావు దగ్గర ప్లీడరు గుమాస్తా. శ్రీనివాసరావు మంచి పేరున్న ప్లీడరు. ధనార్జన తప్ప అతనికి మరో విషయం పట్టదు.

"నే నెందుకు నాన్నగారూ? బాగుండదు."

"బాగుండదురా. ఆ విషయం నీకూ, నాకూ తెలుసు. కానీ మా ప్లీడరుగారికి తెలియదు. ప్రమీల కదో గొప్ప. రేపు ఆయన దగ్గర జూనియర్‌గా చేరవలసిన వాడివి. కాదంటే బాగుండదు గదా?"

కొడుకును ఎప్పటికైనా పెద్ద ప్లీడర్‌ను చేయాలని సుబ్బారామయ్య కోరిక. బి.ఎల్.లో చేర్చేముందు శ్రీనివాసరావు ఆశీస్సులు తీసుకొన్నాడు.

"ప్లీడరు గుమాస్తాల కొడుకులు ప్లీడర్లు, ప్లీడర్ల కొడుకులు ప్లీడరు గుమాస్తాలు అయ్యే కాలం వచ్చిందయ్యా. అలాగే కానియ్. శుభం."

పెళ్ళిచూపుల కొచ్చిన పెళ్ళికొడుకును చూడగానే శంకరానికి కోపం వచ్చింది.

'నువ్వు ప్రమీలకు తగ్గ భర్తవు కానేకావు మిస్టర్. గెటవుట్'. మనసులో అనుకొన్నా ఏర్పాట్లన్నీ బ్రహ్మాండంగా చేసేడు.

"ఇంతకీ ఈ కుర్రాడు మీ కేమవుతాడు శ్రీనివాసరావుగారూ?" పెళ్ళిచూపులయ్యాక ఎవరో అడిగారు.

సమాధానం చెప్పటం కాస్త ఆలస్యం చేసేడు శ్రీనివాసరావు.

"మా గుమాస్తా కొడుకండీ. ఇంటి పనుల్లో మాకు సహాయం చేస్తుంటాడు." ప్రమీలే కలగచేసుకొని చెప్పింది.

బాధపడ్డాడే కాని ప్రమీల మీద కోపం రాలేదు శంకరానికి.

అంతేనా?

ప్రమీలకు ఆ సంబంధం కుదిరినప్పుడు రెండు రోజులు అన్నం తినలేదు శంకరం.

"నీ బాధ నేను గ్రహించాను శంకరం. కానీ వాళ్ళు నీలాగా నాలాగా ఆలోచించరు. అతను ఇంజనీర్. వాళ్ళ నాన్నగారు రిటైర్డు కలెక్టరు. మరి నేనో? ప్లీడరు గుమాస్తాను. నువ్వు ప్లీడరు గుమాస్తా కొడుకువి. పైగా తనకన్నా అందగాడైన భర్తను భరించే తత్వం కాదు ప్రమీలది. 'లా' పూర్తి చేసి వృత్తిలో పైకి రా. అప్పుడు నిన్ను వెతుక్కొంటూ ఎలాంటి వాళ్ళొస్తారో చూడు."

★ ★ ★

సంవత్సరం గడిచింది.

శంకరం 'లా' పాసయి శ్రీనివాసరావు దగ్గర జూనియర్‌గా చేరాడు.

ప్రమీలకు భర్తతో మనస్పర్థ వచ్చింది.

ఎవరో ప్రమీల గానకచేరి ఏర్పాటు చేసేరు. భర్తతో చెప్పకుండానే ఆమె అంగీకరించింది. తీరా కచేరీకి బయలుదేరే ముందు అతనితో చెప్పి అతన్ని తనతో రమ్మంది.

"నే నెందుకు?"

"నా భర్తగా మిమ్మల్ని పది మందికి పరిచయం చేస్తాను. అది మీకు మాత్రం గొప్ప కాదూ?"

"నీ బాడీగార్డ్‌గానో, 'ప్రమీల భర్త'గానో ఉండేకర్మ నాకేమిటి?"

"కర్మా! వాట్ నాన్‌సెన్స్ యూ స్పీక్?"

"నాన్‌సెన్స్ నాది కాదు. నీది. నువ్వు సంగీత కచేరీలు చేయటం నాకిష్టం లేదు.'

"ఇష్టం లేదా? అయితే నేనేం చెయ్యను? నా కది గర్వకారణం. నీ భార్యను పదిమంది పొగడటం నీకు మాత్రం గర్వం కాదూ?"

"కాదు. పది మంది మధ్య నా భార్య పాడటం నేను భరించలేను. నిన్ను పరాయివాళ్ళు పొగిడితే అసలు భరించలేను."

"అసూయా?"

"ను వ్వేమన్నా అనుకో. నువ్వు పాడటానికి వీల్లేదు."

"ఆ మాట పెళ్ళికి ముందు చెప్పాల్సింది. పెళ్ళి చూపుల్లో నా గానాన్ని మెచ్చుకొన్నారు?"

"మెచ్చుకొన్నాను. ఇప్పుడూ మెచ్చుకొంటాను. కానీ నీ అందంలాగా నీ గానమాధుర్యమూ నా ఒక్కడి సొత్తు కావాలి. పదిమందికి పంచుతానంటే ఊరుకోను.'

"ఊరుకోక ఏం చేస్తావ్? నన్ను శాసించే అధికారం ఉందనుకొంటున్నావా? నెవ్వర్. స్త్రీని భోగవస్తువుగా భావించే పురుషులంటే నాకు అసహ్యం. ఐ హేట్ సచ్ పర్సన్స్. గుర్తుంచుకో."

ఆమె భర్తను ధిక్కరించి సంగీత కచేరీ చేయటానికి వెళ్ళబోయింది. అతను బలప్రయోగం ద్వారా ఆపుచేసి ఆమెను బంధించాడు.

ఇదంతా తండ్రికి రాసింది ప్రమీల.

"అలాంటి పశువుతో నేను కాపురం చేయలేను నాన్నా. అందగాడు కాకపోయినా నన్ను ఆరాదిస్తాడని, అడుగులకు మడుగులొత్తుతూ పడి ఉంటాడని ఆ కురూపిని పెళ్ళి చేసుకొన్నాను. ఇక నే నీ అష్టావక్రుడిని భరించలేను."

అమె అదే విషయాన్ని భర్తకు కూడా చెప్పింది.

"నన్ను బెదిరించాలని ప్రయత్నించకు ప్రమీలా. పెళ్ళికి ముందే నువ్వు గర్విష్ఠివని నాకు తెలుసు. అయినా నిన్నెందుకు చేసుకొన్నానుకొన్నావ్? నా పురుషత్వంతో నీ గర్వాన్ని అణిచేసి సామాన్య గృహిణిలా నిన్ను మార్చగలనన్న ధైర్యంతో. నువ్వలా సంసారం చేయగలిగితేనే చెయ్యి. లేకపోతే విడాకులిచ్చేసి వెళ్ళిపో. నాకు అభ్యంతరం లేదు. నేను పురుషుణ్ణి. నీ తలదన్నిన అందగత్తెను రెండో భార్యగా పొందగలను."

"ఎంత పురుషాహంకారం? నీమాత్రం అందగాడు, ఉద్యోగస్థుడు నాకు మాత్రం భర్తగా లభించడనుకొన్నావా? నీలో లేని అనేక గొప్ప లక్షణాలు నాలో ఉన్నాయని మరిచిపోకు."

ఆమె అతనికి విడాకులిచ్చేసి పుట్టింటికి వచ్చేసింది.

"నాన్నగారూ! మనం అతనికిచ్చిన కట్నకానుకలని అణాపైసలతో సహా రాబట్టాలి. వాటిని

ఇమ్మంటే ఇవ్వలేదు. కోర్టులో కేసు పెట్టండి."

"నా ఇంటి పరువును నేను కోర్టుకెక్కించుకోలేనమ్మా. నా కా శక్తి లేదు."

"అలాగా! అయితే శంకరానికి అప్పచెప్తాను. అతను మీ పరువు నా పరువూ కూడా నిలుపుతాడు.'

శంకరం ఆమె చెప్పిందంతా సావధానంగా విన్నాడు.

నీతిబోధ చేద్దామనుకొన్నాడు.

"శంకరం. ప్లీజ్. నాకోసం నువ్వీ కేసు గెలిచి తీరాలి. వాడికి - ఆ పశువుకి, బ్రూట్‌కి బుద్ధి చెప్పాలి.'

అలా ప్రమీల అనగానే శంకరం కరిగిపోయాడు.

"అలాగే ప్రమీలా నీకోసం ఈ కేస్ టేకప్ చేస్తాను. నీకోసమే ఈ కేస్ గెలుస్తాను.'

★ ★ ★

"శంకరం, కోర్టులో ఇవాళ నీ ఆర్గ్యుమెంట్స్ విన్నానోయ్. గాలిలో ఎగిరిపోవాల్సిన కేసుకు గొప్పట్విస్ట్ నిచ్చావ్. కోర్టు వారికి ప్రమీల మీద సానుభూతి కలిగేలా చేశావు. కానీ ఎంత లాయర్లమైనా మనకూ 'మనస్సాక్షి' అనేది ఒకటి ఉండాలి కదా? ప్రమీల తప్పులకు బంగారు కోటింగు నివ్వటం భావ్యమంటావా?' ' శ్రీనివాసరావు అడిగేడు.

"నిజమేనండీ, ఆలోచిస్తే నాకూ నేను చేసిన పని తప్పే ననిపిస్తోంది. కానీ ప్రమీలను తలుచుకొనేసరికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. నిజానికి నేనేం వాదించానో నాకే తెలియదు."

"అలాగా! ప్రమీలంటే నీకు అంత ఇష్టమా? నాకు తెలీదే!"

ఆ సాయంకాలం ప్రమీల శంకరం ఆఫీసులోకి వచ్చింది.

'మా నాన్నను మించిన లాయర్‌వి అవుతావు శంకరం. తొలి కేసు గెలవబోతున్నందుకు నీకు థ్రిల్, ఆ వెధవకు బుద్ధి చెప్పబోతున్నందుకు నాకు థ్రిల్! అన్నట్లు నువ్వు నాకు మరో హెల్ప్ చేయాలి.'

"అంటే......మరో కేసా?"

"కాదు. రేపు సాయంకాలం కోర్టు అయ్యాక నేను రమ్మనచోటికి నాతో రావాలి. నేను చెయ్యమన్నది చెయ్యాలి. ప్రశ్నలు అడగకూడదు. వాదనలు చెయ్యకూడదు. ఏం? అంగీకరించినట్లే కదూ?"

అంగీకరించకూడదనుకొన్నాడు అతను. కానీ ఆమెనే చూస్తూ అంగీకార సూచకంగా తల ఊపేడు.

అదే అతని బలహీనత!

★ ★ ★

కారు దిగి ఆమె వెంట హోటల్ గదిలోకి నడిచాడు శంకరం.

ఆమె రిస్ట్‌వాచ్ చూసుకొని బజర్ నొక్కింది. వెయిటర్ రాగానే కాఫీలకు ఆర్డరిచ్చింది.

"పూర్వం నా పెళ్ళిచూపులకి మీ నాన్నగారూ, నువ్వూ మాకు సాయం చేశారు. అప్పుడు మా నాన్నకోసం చేశారు. ఇప్పుడు నాకోసం నువ్వు మరోసారి నా పెళ్ళిచూపులకి సారథ్యం వహించాలి."

"అంటే....అంటే?" బిత్తరపోయాడు శంకరం.

"ఆవును. కానీ దీన్ని పెళ్ళిచూపులనటానికి వీల్లేదనుకో. అయినా ఇలాంటి విషయాల్లో మధ్యన ఒక పెద్దమనిషి ఉంటే మంచిది కదా? మరో అరగంటలో ఇక్కడికి ఒక అతను వస్తాడు. హోటల్‌లో అన్ని ఏర్పాట్లు నేనే చేసేను. ఎప్పుడేం చేయాలో ఈ కాగితం మీద రాశాను. నువ్వు అలా చేస్తే చాలు. చేస్తావుగా?'

"ఊ. కానీ ఆ వ్యక్తి నీకెలా తెలుసు!"

ఆమె మౌనంగా పేపర్ కట్టింగ్ ఒకటి అతని చేతిలో పెట్టింది. మేట్రిమోనియల్ కాలమ్ అది!

"చిన్న ప్రకటనకు ఎన్ని ఉత్తరాలు వచ్చాయనుకొన్నావ్? కావాలంటే చూడు. ఈ కట్ట ఉత్తరాల్లో నుంచి ఒక్కడిని సెలక్ట్ చేశాను. ఈసారి మా పెళ్ళి విడాకులదాకా రాకుండా జాగ్రత్త పడ్తున్నాలే."

ప్రమీల మొదటి భర్తకన్నా మోహనరావు చాలా అందంగా ఉన్నాడు. చదువు సంస్కారాలు ఉన్నాయి. బోలెడంత డబ్బు, బిజినెస్సు.

కానీ అతని లోపం ఒక్కటే. రెండో పెళ్ళివాడు. మొదటి భార్యతో ముచ్చటగా మూడు నెలలు కాపురం చేశాడు. కారు ప్రమాదంలో చనిపోయిందామె.

"శాస్త్రీయ సంగీతమంటే నాకు చిన్నప్పటి నుంచి వెర్రండీ. నేను మీ అభిమానిని. రేడియోలో వచ్చిన మీ కచేరీలన్నీ కేసెట్‌లోకెక్కించి భద్రపరిచాను. మీరు నా భార్య కాబోతున్నారన్న ఆలోచనే నాకు థ్రిల్లింగ్‌గా ఉంది."

"పెళ్ళయిందాకా అలాగే ఉంటుంది. కానీ పెళ్ళయ్యాక భర్త నన్న ఆధిక్యభావం ఆవేశిస్తుంది. అందుచేత నేను పెట్టే కండిషన్లను అంగీకరించి మీరు ఈ కాంట్రాక్టు మీద సంతకం పెట్టాలి. ఈ శంకరం సాక్షి."

మోహనరావు ప్రమీల చెప్పినట్లల్లా చేశాడు.

★ ★ ★

రెండు సంవత్సరాలు గడిచాయి.

ప్రమీల మోహనరావును తండ్రిని చేసింది. గిరిగీచి ఆ గిరిలో అతన్ని నడిపింది.

రాష్ట్ర రాజధానిలో ఉండటంవల్ల ప్రమీల గాయకురాలిగా ఇంకా బాగా ఎదిగింది. పరిచయాలు పెరిగాయి.

"మోహన్, టీ.వీకి, నా రికార్డింగ్ ఉందివాళ. వచ్చేసరికి ఏ వేళవుతుందో? బిడ్డని పనిమనుషుల

కప్పగించిపోవటం నాకిష్టం లేదు. అందుచేత షాపు మూసేసి ఇంట్లో ఉండు నువ్వు."

"కానీ ప్రమీ. ఒక్క రోజు షాపు మూస్తే ఎంత నష్టమో......"

"అయ్ డోంట్ కేర్ ఫర్ మనీ.."

"మనీ మాత్రమే కాదు. బిజినెస్ గుడ్‌విల్ కూడా పోతుంది."

"నాకు నేమ్ అండ్ ఫేమ్ వస్తాయి కదా? డోంట్ బాదర్."

అతను అంగీకరించి ఇంట్లో ఉండిపోయాడు. బిడ్డతో బాధపడ్డాడు.

ఆ రోజుతో అలాంటి అనుభవం ముగుస్తుందనుకొన్నాడు.

కానీ ప్రమీల కార్యక్రమాలు పెరిగాయి. తరచూ షాపు మూయాల్సి వచ్చింది. బాధను మనసులో మూతపెట్టి ఉంచలేక పోయాడు మోహనరావు.

"బిడ్డను నేను చూసుకోలేను ప్రమీలా. నాకు సాధ్యం కాదు."

'ఏం? అలవాటయిందిగా? కావాలంటే బాబుని తీసుకొని నా వెంటరా. నామోషీపడితే ఎలా?'

"నా పనులు నాకున్నాయి గదా? బాబును నువ్వే చూసుకో."

"ఏం? వాడు మీకు మాత్రం బిడ్డ కాదా? వాడి పెంపకం బాధ్యత మీకు లేదా? నేను ప్రోగ్రామ్‌కు వెళ్ళినప్పుడు వాడిని మీరే చూసుకోవాలి. మన కాంట్రాక్టు మరిచిపోవద్దు.'

"కాంట్రాక్టులో ఆ విషయం లేదనుకొంటాను."

"ఓహో! కాంట్రాక్టులో లేకపోతే చేయవన్నమాట! మొగుడు లేకుండా నేను బతకలేననుకోకు మోహనరావు. నేను విడాకులిస్తే అప్పుడు బిడ్డనెలా సాకుతావ్?"

"అప్పుడు వాడు నా ఒక్కడి వాడవుతాడు. నా తంటాలేవో నేను పడ్తాను."

"అయితే పడు. నీకు విడాకులిస్తాను. బిడ్డను నీకే వదిలేసి పోతాను."

ఆవేశంలో అన్నదనుకొన్నాడతను. కానీ విడాకులు తీసుకొన్నదాకా వదల్లేదామె.

"ఐ పిటీ యూ మోహన్‌రావ్. నాలాంటి అందగత్తెను, గొప్పదాన్ని భార్యగా పొందటమే నీ అదృష్టం. నిలుపుకునే యోగ్యత నీకు లేకపోయింది. ప్చ్."

"నిన్ను ఆరాధించే భర్తను, బిడ్డను నిలుపుకొనే యోగ్యతను చేజేతులా పోగొట్టుకున్నావ్! దానికేమంటావ్?"

"ఆరు నెలలు తిరగకుండా నీకన్నా ఎక్కువగా ఆరాధించే భర్తను - కుక్కపిల్లలాంటి భర్తను పొందుతాను చూసుకో."

పుట్టింటికి తిరిగి వచ్చిన ప్రమీలను చూసి ఎవరూ ఆశ్చర్యపోలేదు.

"మళ్ళీ దావా చెయ్యాలా?"

"చెయ్యాలి. కానీ కోర్టులో కాదు. వాడి మొహం మీద."

★★★

శంకరం కోర్టు కెళ్ళే టైమయింది. ఆ రోజు వాదించాల్సిన అతి ముఖ్యమైన కేసులో ఆలోచన పూర్తి కాలేదు. అలాంటి సమయంలో అతని నెవరూ డిస్టర్బ్ చెయ్యరు.

అతనిప్పుడు లీడింగ్ లాయరయ్యాడు. శ్రీనివాసరావు ఫైలంతా అతనికే వచ్చింది. సుబ్బరామయ్య కోరిక తీరింది. కొడుకు దగ్గరే ప్లీడరు గుమాస్తా అయ్యాడు.

కానీ శంకరం, పెళ్ళి ప్రసక్తి ఎత్తితేనే పారిపోతున్నాడు. అదే ఆయన బాధ!

"ట్రింగ్....ట్రింగ్......."

"హలో, శంకరం! మద్రాసులో కచేరి చేసి ఇప్పుడే తిరిగొచ్చాను. నీతో అర్జెంటుగా వో ఇంపార్టెంట్ మేటర్ మాట్లాడాలి. ఈ రోజు కేసులన్నీ వాయిదా వేసుకో. ఏం?"

కాస్త ఆలోచించి 'ఓకే' అన్నాడు.

మరో అరగంటలో ఆమె వచ్చి శంకరాన్ని ఒక బ్రహ్మాండమైన హోటల్‌కి తీసికెళ్ళింది.

"ని న్నిక్కడికి ఎందుకు తీసుకొచ్చానో ఊహించావా?"

"ఊహూ...."

"నా ఫస్ట్ మేరేజ్‌కి నువ్వు సాయం చేశావు. సెకండ్‌కి సారథ్యం వహించావు. థర్డ్ మేరేజ్‌కి ముఖ్యపాత్రవు కాబోతున్నావు."

"అంటే?'

"నటించకు శంకరం. బీ ఫ్రాంక్. నాకు భర్తవయ్యే అదృష్టాన్ని ఈసారి నీకిస్తున్నాను.'

"థాంక్యూ ప్రమీలా థాంక్యూ. బట్......"

"నో కండిషన్స్. నో కాంట్రాక్ట్. ఎందుకంటే నువ్వు నన్ను ఎప్పటి నుంచో ఆరాధిస్తున్నావని నాకు తెలుసు. భక్తుడిని దేవి అనుగ్రహించిందిప్పుడు."

"నిజమే ప్రమీలా. నేను నిన్ను ఆరాధించాను. కానీ పుష్పాలన్నీ దేముడి పూజకు పనికిరావు కదా? కాగితం పూలు చూసి ఆనందించటానికి బాగుంటాయి. మల్లెపూలు తలలో పెట్టుకోటానికి బాగుంటాయి. కానీ కాగితం పువ్వు అందం, మల్లెపూవు వాసన లేని తుమ్మిపువ్వుకు మాత్రమే శివుడి శిరసునెక్కే అర్హత ఉంది. నేను కోరుకొనేది తుమ్మిపువ్వు లాంటి భార్యను."

"అంటే.........?"

'సారీ. నిన్ను నీ సంగీతాన్ని ఆరాధిస్తాను. కానీ నీకు మరో మాజీ భర్తను మాత్రం కాలేను.'

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 3-2-1988